క్లుప్తంగా

పెద్దిరెడ్డిని కలిసిన నాయకులు



పెద్దిరెడ్డిను కలిసి మాట్లాడుతున్న మండల నాయకులు

చౌడేపల్లె: పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం తిరుపతిలోని ఆయన స్వగృహంలో మండల నాయకులు కలిశారు. ఆయన ఆరోగ్యం ఎలా ఉందో అడిగి తెలుసుకున్నారు. మండలంలోని సమస్యలను పెద్దిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సింగిల్‌విండో మాజీ చైర్మన్ రవిచంద్రారెడ్డి, నాయకులు బాలాజి, గిరిబాబు, మునికృష్ణమనాయుడు, బీఎస్ రెడ్డి, ఆనందరెడ్డి, రెడ్డెప్పరెడ్డి, కృష్ణారెడ్డి తదితరులున్నారు.

ఆస్తి పన్నుపై 5 శాతం రాయితీ

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఆస్తి పన్నులు చెల్లించే వారికి ప్రభుత్వ ఆదేశాల మేరకు 5 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు కమిషనర్ మధుసూదన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ నెలాఖరులోపు పన్ను చెల్లించే వారు రాయితీ పొందవచ్చని, దీనిని పన్నుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సింహవాహనంపై సోమేశ్వరుడు



సింహవాహనంపై ఊరేగుతున్న సోమేశ్వరస్వామి

పుంగనూరు: పట్టణంలో నగిరివీధిలోని శ్రీసోమేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం మూడవ రోజు సింహవాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. తొలుత అర్చకులు షణ్ముక దీక్షితులు శివపార్వతుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

మిట్టూరులో సీతారాముల ఊరేగింపు



ప్రత్యేక పూజలందుకున్న సీతారామలక్ష్మణులు

చౌడేపల్లె: మండలంలోని పుదిపట్ల పంచాయతీ మిట్టూరులో ఆదివారం రాత్రి కల్యాణోత్సవం అనంతరం సీతారామ లక్ష్మణ ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తులను చాందినీ బండిలో విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి గ్రామంలో మేళతాళాల నడుమ ఊరేగించారు. అలాగే, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. భక్తులకు అన్నదానం చేశారు. పానకం పంపిణీ చేశారు.

ఘనంగా కురబ కుల దేవర



దేవరలో దర్శించుకుంటున్న ఎంపీపీ

వి.కోట: మండల సమీపంలో కర్ణాటకలోని అంగళంలోని శ్రీ అంగళం బెంగుళూరురాయ స్వామి కురబ కుల దేవర మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ యువరాజు, పార్టీనాయకులతో కలిసి ప్రత్యేక పూజా కార్యక్రమాలకు హాజరయ్యారు. గ్రామస్తులు ఆయనకు ఆత్మీయ స్వాగతం పలికారు. మండల వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సింహ వాహనంపై సీతా రామలక్ష్మణులు



తవణంపల్లె: మండలంలోని అరగొండ కోదండరామాలయంలో శ్రీరామ నవమిని పురస్కరించుకొని సోమవారం రాత్రి సింహ వాహన సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం సీతా రామలక్ష్మణులకు అభిషేకం, ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అర్చకులు ఉత్సవమూర్తులకు పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. విద్యుద్దీపాలంకరణ, సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించిన సింహ వాహనంపై సీతా రామలక్ష్మణులు విహరిస్తూ భక్తులకు కనువిందు చేశారు. భక్తులు స్వామికి పూజలు చేసి మొక్కులు చెల్లించారు. మంగళవారం ఉదయం స్వామికి అభిషేకం, పూజలు, రాత్రి హనుమంతు వాహన సేవ ఉంటుందని కార్యనిర్వాహకులు తెలిపారు.

మోత భారం

పిట్ట కొంచెం..కూత ఘనం..సామెతకు తానేమీ తీసిపోనా!? అన్నట్టు ఇక్కడ బండి ఆపసోపాలు పడుతోంది. ఎదురు గాలి వీస్తున్నప్పటికీ ఈ చిన్న వాహనం బండెడు భారంతో వెళ్తూ సోమవారం 'సాక్షి' కెమెరాకు కంట పడింది. చౌడేపల్లె నుంచి మదనపల్లె వైపు టాటా ఏస్ వాహనంలో గుజిరీ వస్తువులు, ప్లాస్టిక్ బాటిళ్లతోపాటు ఇతర వస్తువులతో కూడిన మూటలు ఎత్తుగా పేర్చేశారు. కనీసం నంబర్ ప్లేట్ కూడా సక్రమంగా లేకపోవడం, నిబంధనలు పాటించకుండా వెళ్తుండటం గమనించి స్థానికులు..ఇలా వెళ్తే ప్రమాదాలు జరగవా? అని చర్చించుకున్నారు.

–చౌడేపల్లె



ఎత్తు బస్తాలతో వెళ్తున్న టాటా ఏస్ వాహనం

మేము సైతం..!

వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో పట్టణానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల సౌకర్యార్థం స్థానిక ఆజాద్ ఆటోస్టాండ్ కార్మికులు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. మట్టికుండల్లో నీరు ఏర్పాటు చేసి గ్లాసులు పెట్టారు. తాము ఆటోలపై ఆధారపడి కుటుంబాలను పోషిస్తున్నప్పటికీ వేసవిలో ప్రజలకు తమవంతు సేవ చేయాలని చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు చెప్పారు. వేసవి ముగిసే వరకూ చలివేంద్రాన్ని నిర్వహిస్తామన్నారు.

–పుంగనూరు



పుంగనూరులో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఆటో కార్మికులు

నోటీస్ బోర్డు

11 నుంచి కావమ్మ మారయ్య ఉత్సవాలు

రొంపిచెర్ల: ఈ నెల 11 నుంచి 14 వరకు మండలంలోని మోటుమల్లెల గ్రామ పంచాయతీ బెస్తపల్లెలో కావమ్మ, మారయ్య ఉత్సవాలను నిర్వహించనున్నట్టు గ్రామస్తులు సోమవారం తెలిపారు.11న రాత్రి కావమ్మ జీవిత చరిత్ర బుర్రకథ, 12న రాత్రి 8 గంటలకు కావమ్మ, మారయ్య కల్యాణోత్సవం, కావమ్మ బుర్రకథ, 13న రాత్రి 9 గంటలకు అగ్ని గుండం, కావమ్మ బుర్రకథ, మంచి నీళ్ల జ్యోతి వెలిగించడం, 14న అగ్ని గుండ ప్రవేశం, కావమ్మ నిమజ్జన కార్యక్రమాలు ఉంటాయన్నారు. ప్రతిరోజూ రాత్రి 7 గంటలకు అన్నదానం చేయనున్నట్టు తెలియజేశారు.

11న మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు: ఎస్సీ, ఎస్టీ మానటరింగ్ కమిటీ సమావేశం ఈనెల 11న ఉదయం 11 గంటలకు తన కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రాము సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిశాఖల అధికారులు విధిగా హాజరు కావాలని కోరారు. ఇదలా ఉంచితే, కమిటీ ఎస్సీ, ఎస్టీ మానిటరింగ కమిటీ సమావేశాలు సక్రమంగా నిర్వహించడం లేదని మాల మహానాడు కార్యదర్శి ఎస్ఆర్ అశోక్ ఆరోపించిన నేపథ్యంలో ఏర్పాటుకు పూనుకోవడం గమనార్హం!

ప్రకృతి వ్యవసాయంతో ప్రగతి సాధించడమే లక్ష్యం

- డీపీఎం వాసు

పుంగనూరు: ప్రకృతి వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సహజ సిద్ధమైన ఎరువులను వాడాలని వ్యవసాయశాఖ డీపీఎం వాసు కోరారు. సోమవారం ఏడీ శివకుమార్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సు నిర్వహించారు. వాసుతోపాటు ఏడీ మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయంలో బహుపంటల విధానం, బహుసాగు పద్ధతులు పాటిస్తే రైతులు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. రసాయన ఎరువులు, పురుగుల మందులు వాడటం వలన పెట్టుబడి ఖర్చులు పెరగడంతోపాటు పంట దిగుబడిలో మందుల అవశేషాలు ఉండి, వినియోగదారుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. నియోజకవర్గంలోని 7,204 మంది రైతులతో ప్రకృతి వ్యవసాయంతో ప్రగతి సాధించడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు ఫైజున్నీసా, రెడ్డికుమారి, వెలుగు సీసీలు, సీఓలు, కార్యదర్శులు, సంఘమిత్రలు, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల తయారీపై ప్రత్యేక దృష్టి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

పలమనేరు: పట్టణ సమీపంలోని మున్సిపల్ డంపింగ్ యార్డులో సేంద్రియ ఎరువుల తయారీపై ఇక ప్రత్యేక దృష్టి సారిస్తామని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి చెప్పారు. సోమవారం ఆయన సంబంధిత అధికారులతో కలసి డంపింగ్ యార్డు, ఎఫ్ఎస్టీపీ యూనిట్‌ను పరిశీలించారు. పట్టణం నుంచి నిత్యం చేరుతున్న పొడి, తడిచెత్తల సెగ్రిగేషన్, ఆపై చేస్తున్న పనుల గురించి ఆరా తీశారు. ఇదే చోట కుక్కలకు స్టెరిలైజేషన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో పట్టుకున్న వీధికుక్కలను దూరప్రాంతాలకు తీసుకెళ్లకుండా ఇక్కడే ఆపరేషన్లు చేయడంతో మున్సిపాలిటీకి రవాణా చార్జీల భారం తప్పుతుందన్నారు. కార్యక్రమంలో మేనేజర్ మొహిద్దీన్, ఏఈ స్నేహప్రియ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మోటార్ సైక్లిస్టులకు గాయాలు

వి.కోట: మోటార్ సైకిల్ అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడిన సంఘటన సోమవారం వి.కోట–కుప్పం జాతీయ రహదారిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం.. రామకుప్పం మండలానికి చెందిన తబరేష్, నయాజ్ బాషా వి.కోటలోని స్విమ్మింగ్ పూల్‌కు వచ్చి తిరిగి రామకుప్పానికి మోటార్ సైకిల్‌లో వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యారు. మార్గమధ్యంలో అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు 108లో కుప్పం పీఈఎస్‌కు తరలించారు.

గుర్తు తెలియని బైక్ ఢీ: ఒకరికి తీవ్రగాయాలు



చౌడేపల్లె: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చౌడేపల్లె–పలమనేరు మార్గంలోని జంగాలపల్లె బస్టాప్ సమీపంలో చోటుచేసుకుంది. వివరాలు.. చారాలకు చెందిన వెంకటరమణ రోడ్డు పక్కన నడచి వెళ్తుండగా వెనుక వైపు నుంచి వచ్చిన బైక్ వేగంగా ఢీకొని వెళ్లిపోయింది. గాయపడిన అతన్ని స్థానికులు చౌడేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. కాలు విరగడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం పుంగనూరుకు తరలించారు. బాధితుడి కుమార్తె గీత పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రమాదంలో గాయపడిన వెంకటరమణ

వడదెబ్బపై విస్తృత అవగాహన కల్పించండి



అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

- పోస్టర్ల ఆవిష్కరణలో కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్: ప్రజలు వడదెబ్బ తగలకుండా ముందు జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తెలిపారు. వడదెబ్బ తగలకుండా ముందస్తుగా చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభంలో ఎండలు ఎక్కువగా ఉంటాయన్నారు. పదేళ్లలోపు పిల్లలు, వృద్ధులు, బాలింతలు, గర్భిణులు ఎండల విషయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లా వైద్య శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో ప్రజలకు వడదెబ్బ లక్షణాలు, జాగ్రత్తలపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్ఓ మోహన్‌కుమార్, డీఎంహెచ్ఓ సుధారాణి పాల్గొన్నారు.

మాజీ ఎంపీటీసీ మృతి



దేవేంద్రరెడ్డి (ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని తుంబకుప్పం మాజీ ఎంపీటీసీ సభ్యుడు దేవేంద్రరెడ్డి(51) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. దేవేంద్రరెడ్డి పొలం వద్ద పనులు చేస్తుండగా గుండెపోటుకు గురై పొలం వద్దే ఉన్నఫళంగా కుప్పకూలాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు తుంబకుప్పంలోని ఆస్పత్రికి తీసుకువచ్చారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దేవేంద్ర రెడ్డి వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని, ఆయన మృతి బాధాకరమని స్థానిక సర్పంచ్ లీలావతమ్మ, ఎంపీపీ అమరావతి, మాజీ సర్పంచ్ అరుణామల్‌రెడ్డి, సీనియర్ నాయకులు విద్యాసాగర్‌రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

డీఈ కార్యాలయ నిర్మాణ పనులు ప్రారంభం



స్థలాన్ని జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో డివిజన్(డీఈ) కార్యాలయ నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించారు. స్థానిక గిరింపేటలో ఉన్న ట్రాన్స్‌కో స్థలంలో నిర్మాణ పనులకు పూనుకున్నారు. జేసీబీతో స్థలాన్ని చదును చేసి, పిల్లర్లు, ట్యాంకుల కోసం తవ్వకం పనులు మొదలెట్టారు. డివిజన్, సబ్‌డివిజన్ కార్యాలయాలను భవనంలో నిర్మించనున్నట్లు సివిల్ డీఈ గోవిందరాజులు తెలిపారు. మొత్తం రూ.48 లక్షలతో పనులకు ఆమోదం వచ్చిందన్నారు. మరో 5 నెలల్లో పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

చిత్తూరు అర్బన్: గంజాయి అక్రమ రవాణా కేసులో పారిపోయిన నిందితుడిని చిత్తూరు టూటౌన్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. గతేడాది నవంబర్‌లో నగరంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు నిందితులను టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనలో తప్పించుకున్న బంగారుపాళ్యంకు చెందిన వేణు (36)ను ఇప్పుడు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

ఘనంగా కేడయ ఉత్సవం



పల్లకిలో స్వామివారు

చిత్తూరు రూరల్(కాణిపాకం): పంగుణి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని శ్రీఅగస్తీశ్వరస్వామి ఆలయంలో సోమవారం కేడయ, గజ వాహనంపై స్వామి వారు భక్తులను కటాక్షించారు. ఆలయంలోని స్వామి వారికి అభిషేక పూజలు చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం కేడయ వాహనంపై ఊరేగించారు. రాత్రి గజ వాహనంపై విహరిస్తూ భక్తులకు స్వామి వారు అభయమిచ్చారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆరోగ్య సంరక్షణకు ప్రాధాన్యత



కల్లూరులో సిబ్బందితో ర్యాలీ



రొంపిచెర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

- పలుచోట్ల ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీలు
- ఆరునెలలకోసారి వైద్య పరీక్షలు చేసుకోవాలన్న వైద్యాధికారులు

పులిచెర్ల(కల్లూరు): ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సంరక్షణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికలాఫీసర్ డాక్టర్ జానకీరావు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని సోమవారం వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించి ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శారద, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలి

రొంపిచెర్ల: సమాజంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని పీహెచ్‌సీ డాక్టర్లు దినేష్‌కుమార్ నాయక్, వినయ్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య సిబ్బందితో కలసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ వహించాలని కోరారు. కనీసం ప్రతి ఆరు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం అన్ని రకాల జబ్బులకు ఉచితంగా ఆపరేషన్లు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. అనంతరం విధి నిర్వహణలో సమర్థవంతంగా పనిచేసిన సిబ్బందికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థూలకాయంతో ఆరోగ్య సమస్యలు

చౌడేపల్లె: స్థూలకాయులుగా ఉంటే ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని వైద్య సిబ్బందితో అవగాహన ర్యాలీ నిర్వహించి ఆయన మాట్లాడారు. పరిశుభ్రమైన ఆహారాన్ని తగినంత తీసుకోవాలన్నారు. అధిక బరువు పెరిగితే మధుమేహం బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. క్రమం తప్పకుండా తేలికపాటి వ్యాయామాలు చేయాలని, స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ప్రతి ఆరునెలకోసారి ప్రతి ఒక్కరూ విధిగా మధుమేహం వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అలాగే వేసవి తీవ్రత పెరుగుతున్న తరుణంలో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలు, ఆహారం, పానీయాలు గురించి తెలియజేశారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి

పుంగనూరు: ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యతనివ్వాలి అని మెడికలాఫీసర్ డాక్టర్ తేజశ్రీ అన్నారు. సోమవారం మండలంలోని ముడిబాపనపల్లె పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అడవినాథునికుంటలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. మెడిలాఫీసర్ మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని గుర్తెరగాలన్నారు. వివిధ రుగ్మతల బారిన పడకుండా ఉండేందుకు ఆహారనియమాలు, వ్యక్తిగత శుభ్రత ఖచ్చితంగా పాటించాలని, వ్యాయామం చేస్తూ క్రమబద్ధమైన జీవితాన్ని సాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

బైరెడ్డిపల్లె: శారీరకంగా, మానసికంగా ఉండేందుకు ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని వైద్యాధికారి విజయ్‌చంద్ర అన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు. మంచి పోషకాహారం తింటూ యోగా, ధ్యానం, సంగీతం, శిల్ప కళలు, ఆటలు వంటివి అలవాటు చేసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. . కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సావిత్రమ్మ, సీహెచ్ఓ అనూరాధ, సూపర్‌వైజర్లు గోపి, పుష్పలత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



చౌడేపల్లె: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



బైరెడ్డిపల్లె: పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి విజయ్‌చంద్ర